అడవి పూవు

శ్రీ బలివాడ కాంతారావు

కనకరాజు భార్య కమల సన్నజాజి పువ్వులా నాజుగ్గా సన్నంగా ఉండేది. ఎప్పుడూ వాడని పుష్పంలా నున్న ఆమె మోమును మనసారా ఆమె నిద్రపోతున్నా కూడా చూస్తూ మురిసి పోయేవాడు. ఆ దరహాసం నీలి ఆకాశంలో చవితి చందమామ చిరునగవులా ఉండేది. హంసల్లాంటి తెల్లని బట్టలు కట్టుకొని, అపూర్వమైన వయ్యారం ఒలకబోసుకొని ఒక్కొక్క అడుగు వేస్తుంటే, గుప్పెట్లో ఇమిడిపోయేటట్లున్న ఆ నడుమును పట్టుకొని ఆమెను తనవేపు త్రిప్పుకోవడం అలవాటే. నిజం చెప్పి న్యాయంగా ధనార్జన చేస్తే మనస్సెంత చల్లగా ఉంటుందో, ఆమెతో కాపురం అలా ఉండేది. రాబడి ఖర్చులు త్రాచులో సరితూగుతున్నట్లు సంసారం సాగించేది. జీవితం నల్లచుక్క పడని తెల్ల కాగితంలా ఉండేది.

చల్లనిగాలి, చిలికి చిలికి గాలివాన అయినట్లు ఒకనాడు కనకరాజు జీవితం భీభత్సం అయిపోయింది. సమ్మోహనంగా ఉండిన వసంతం గ్రీష్మంగా మారింది. కళ్లల్లోని ఆశాజ్యోతులు నిరాశతో నీరైపోయాయ్. సంతోషంతో ప్రవహించిన హృదయం దుఃఖంతో చెక్కలైంది. అతను యేది నిత్యం యేది సత్యం అనుకున్నాడో అది మాయా అసత్యం అయిపోయాయ్. కమల చనిపోయి ఆరు నెలలైనా నిన్నా మొన్నా ఆ పిడుగులాంటి సంఘటన జరిగినట్లుంది. దైన్యాన్ని గుటకలు మ్రింగి, శోకాన్ని భరించి, ఇద్దరి పాపల్ని ప్రాణప్రదంగా చూసుకుంటున్నాడు. మాటాడిన పుష్పాన్ని కోల్పోయిన అతని మనస్సు, మాటాడని మొగ్గలతో పరిచయాన్ని యేర్పరచుకుంది. అందుకే కళ్ల వేడుకనిచ్చే పూలతోటను తన బంగళా చుట్టూ సృష్టించుకున్నాడు.

ఒక నాటి వేకువఝామున యేదో కలగని తెలివి తెచ్చుకున్న కనకరాజు నిస్పృహను నరకాలని మనసును పూలతోటపై మళ్లించాడు. తోటలోనికి వచ్చి సిమెంటు దిమ్మపై కూర్చున్నాడు. వికసిస్తున్న మొగ్గలా, విచారం వదలుతున్న మనసులా ఉషస్సు ఉదయిస్తోంది. తన కుటుంబంలోని వ్యక్తుల్లా, ఆ రకరకాల పూలచెట్లతో అతనికి సన్నిహితం ఉంద. ఉదయభానుని రక్తాన్నంతా పీల్చేసి యెరుపుదేరిన మందారాలు సాయంత్రానికల్లా ఆ రక్తాన్నంతా తిరిగి అతనికి అప్పచెప్పి తలలు వంచేస్తాయ్. మల్లెలు కొల్లలుగా పూసి బంగళా చుట్టూ పన్నీరు జల్లుతాయ్. బొద్దుగా ఠీకరంగా పూసిన బొగడలు, ఆకుల్లో అణగి అపూర్వమైన వాసనలను వెదజల్లుతున్న సంపెంగలు, ఝుమ్మని రొదచేసే తుమ్మెదలను ఆహ్వానించే రంగురంగు గులాబులు, ముఖాన్ని పొడరు వత్తుకొని రాత్రంతా సరసుని కోసం వేచివున్న శోభనాంగిలా నున్న లిల్లీపూలు— వీటన్నిటి పేర్లు తెలుసు. వీటి అందాలు పరిమళాలు అతని మనసులో చోటు చేసుకొని మూగ బాసలతో తన దుఃఖాన్ని ఉపశమింప చేస్తున్నాయ్.

ఆకసంలో తోకచుక్కలా ఒక్కసారి తన దృష్టిని తొలిసారి గేటు దగ్గరేనున్న పేరు తెలియని పూలమొక్క ఆకర్షించింది. పెద్దకాడతో తెల్లగా ఒక పూవు తొలిసారి విడివడింది. ఆకలితో సన్నబడిన తల్లిలేని పిల్లలాంటి మొక్కను షికారుకు వెళ్లినప్పుడు ఆరునెలల క్రితం తెచ్చినాటాడు. సున్నిత మెరుగని రూపుతో మోటు ఆకులతో నున్న అడవి మొక్క అంత అందమైన పూవుతో సింగారించుకుంటుందని తను వూహించుకోలేదు. అందమైన పువ్వును చూడగానే ఆ పూలమొక్కపై అభిమానం ముంచుకొచ్చింది. గబగబా దగ్గరకెళ్లి నిల్చొని చెట్టుని ఒకసారి ఆప్యాయంగా తాకపోతుంటే చేతిలో కాఫీ కప్పుతో పున్నమ్మ ప్రత్యక్షమైంది. ఇన్నాళ్ల తను లేచేసరికి బెడ్‌కాఫీ మంచం ప్రక్కనే బల్లమీదుండేది. ఈ వేళ తను వేగంగా లేచిపోవటం ఈమె తనకు దగ్గరగా రావటంతో పరీక్షగా చూడటం జరిగింది.

రెండేళ్ల క్రితం ఆఫీసునించి ఇంటికి వచ్చేసరికి ఆకలితో చిక్కి అసహ్యంగా నున్న పిల్ల అగపడింది. ఎవరని అడక్కుండానే కమల ఆ పిల్లగాథ చెప్పింది. ఆ పిల్లకు యెవ్వరూలేరట. అడుక్కొని కడుపు నింపుకుంటోంది. పని చేసుకోరాదా అంటే యెవరిస్తారని యెదురు ప్రశ్న వేసింది. ఆ ప్రశ్నకు సమాధానంగా కమల ఆ పిల్లని పనిపాట్లు చెయ్యడానికి పెట్టుకుంది.

కమల పోయాక ఇంట్లో పని, వంట, పిల్లల కింద సేవ పున్నమ్మే చేసుకుంటోంది. భార్య ఉన్నప్పుడు, పోయినప్పుడు, ఇంత వరకు తనలో ఆమెపై రాజుకున్న మోహం ఇంక పున్నమ్మ అంటే తొలి రోజు చూసిన ఆకారమే మనసులో మెసలు తుంది.

ఈ రోజు అడవి పూవు మీద చూపించిన శ్రద్ధే ఆమె వేపు చూసాక కలిగింది. పోషణతో పాటు ప్రమోదమైన వాతావరణం ఆమెను అడవి మొక్కలా రేపుగా బలిష్ఠంగా పెంచింది. వయసు ఒళ్ళంతా ప్రాకిపోయింది. ఆమె అవయవాల పొందిక చూసిన కనకరాజు మనసు ఒక్కసారి చలించింది. కాఫీ త్రాగుతూ ఆగిఆగి క్రీగంటుగా ఆమెవేపు పదేపదే చూసాడు.

ఆమె అక్కడనించి కదిలాక ఆమె వెంటపడానీ, ఒక సారి ఆమె కళ్లల్లోకి దీక్షగా చూడానీ, ఆమె చిరునవ్వు ఒలగ బోస్తే తాను యెన్నాళ్లకు మళ్లీ నవ్వ గలిగానని— ఇలా మన సులో ఆలోచనలతో పాటు ఆక్షేపణలను కూడా సృష్టించు కున్నాడు. చెక్కిన దంతం బొమ్మలాంటి కమలలో మంత్రిం చిన మోహం ఉండేది కాదు. ఆమె అందం, సంస్కారం అంతా సున్నితమైంది. సిల్కు బట్టలాంటి శరీరం ఆమెది. మగవాడి చూపులను వెనక్కి రాకుండా బంధించగల బలిసిన యువ్వనాన్ని తాకాలనే కోర్కె కమల ఉన్న రోజులనించీ తీరని కోర్కెగా నిలచి పోయింది.

ఎంతో ఈ అడవిపూవు పికపిక మంటూ తోటలోని అన్ని పూలకు దీటొంటున్నది. రోజూకు రోజూ అతని అందోళన ఆవేశం నల్లమేఘాలు పుంజుకొని ఢీకొన్నట్లు మనసులో రగులుకుంటున్నాయి. కమ పోతే మళ్లీ పెళ్లి చేసుకోనని ఢంకా మీద దెబ్బకొట్టినట్లు తెలియపర్చిన తన నిర్ణయాన్ని అంతా హర్షించారు. తన యేకపత్నీవ్రతాన్ని శ్లాఘించారు. కమల లాంటి అపూర్వమైన స్త్రీతో కాపురం చేసిన వాడు అలాంటి స్త్రీని మళ్లీ పొందలేడన్న భావం తనలో పాతుక పోయి ఉండేది. ఇప్పుడు గాలితో పొంగిన రబ్బరు బెలూనులా యువ్వనంతో పొంగిన పున్నమ్మవేపు దొంగ చూపులు చూస్తుంటే కనక రాజు మతిపోతుంది.

ఈ అడవిపూవు యెంతకాలం ఇంత మనోహరంగా చెట్టున ఉంటుంది ? రాలిన రాలుతుంది ! ఎవరైనా తెంపినా తెంపుతారు. ఏదో తుమ్మెద వాలితే పూవు కాయవుతుంది. కాలం అందాన్ని తెస్తుంది. అందాన్ని మింగుతుంది. చావు పుట్టు కల మధ్యకాలం దైన్యాన్ని కాకుండా ఆనందానికి వినియోగించు కోవటంలో ఉంది మనిషి ప్రజ్ఞ. ఈ ప్రజ్ఞను తను, నలుగు రిలో అర్థంలేని గౌరవం తెచ్చుకోవడం కోసం యెందుకు వదలుకోవాలి ?

కోరిక బాధించినా, ధర్మం తెలుసుకున్నవాడు కాబట్టి ఇంట్లో ఉన్న పున్నమ్మను ముట్టుకోలేక పోయాడు. అప్పు డప్పుడు మనసు పట్టుతప్పి ఆమె వేపు కళ్లల్లో నీరుగా మారిన కామంతో దీనంగా చూసేవాడు. ఆమె చూపులు యెప్పుడూ మిణుకు మిణుకు మనే చుక్కల్లా ఉండేది. చుక్కలవేపు చూసి కవిత్వం అల్లుకునే ప్రేమికుల్లా మనసులో అనుభూతులు కలిగేవి. మరికొన్ని రోజులు పోయాక ఆమె వడ్డిస్తోంటే కుదురుగా ఉన్న చేతులను తాకాలని తాకలేక చిన్న నవ్వు నవ్వితే జవాబు రాలేదు. బాధపడినా ఇంకోసారి వంటింట్లో ఒక్కర్తె ఉంటే దగ్గరకు వెళ్లాలని రెండు అడుగులు వేస్తే పున్నమ్మే ఇటు వస్తూ యెదురయింది. చేతులు తగిలాయి గానీ ఆమె ప్రక్కకు కదిలి పోయింది. తరవాత తోటలోనికి వచ్చి యేకాం తంగా కూర్చుని గంటల తరబడి తనను తాను విమర్శించు కున్నాడు. నరాల పొంగు తగ్గిన తరవాత తెలివి తెచ్చుకొని అంతా కల అనుకున్నాడు. పున్నమ్మ తన కళ్ల యెదుట తన కూతు రిలా పెరిగింది. కనికరించినా కడతేర్చినా తనే చెయ్యాలి. ''దుష్టులు చేసే పాపం సమర్థుడు చూసి వూరుకుంటే, వాళ్ల పాపంలో తను భాగస్థుడవుతాడని'' మహాభారతంలో చదివాడు.

సమర్థుడనుకున్న తనే దుష్టుడైతే పాపం పండి పోతుంది. తెలివితక్కువ వాడు, మూర్ఖుడు చేసిన మహా పాపాల కంటే తెలివైన వాడు, సమర్థుడు చేసిన కొద్ది పాపమే హెచ్చుగా పరిగణింప బడుతుంది.

ఈ ధర్మా ధర్మ విచక్షణ ఇంకా మనసులో నించి తుడిచి పెట్టక ముందే ఆ మరుచటి రోజు ఒక సంఘటన జరిగింది. వేగంగా ఆఫీసునించి వచ్చేసాడు. పున్నమ్మ ఇంకో ఇనుపగుండులా ఉన్న యువకునితో కులాసాగా పకపక నవ్వుతూ యేకాంతంగా యెంతో పరిచయ మున్నట్లు మాటాడుతోంది. ఆ మాటల్లో మోటుహాస్యం విన్నాడు. ఆ కొంటె చూపుల్లో కోరికలు చూసాడు. తిరిగి వెనుకకు బాధతో కదలి పోయాడు ఆ రాత్రి తిండి దగ్గర ఆమె వేపు చురచుర చూసాడు. ఆ చూపుల్లో ఆక్షేపణ, ఈర్ష్య, నిరసన అంతా వ్యక్త పరిచాడు. ఆమె తొణకలేదు బెణకలేదు. మామూలుగా పనిపాట్లన్నీ చేసుకుంటోంది. ఏదో అందామనుకున్నాడు. మందలిద్దా మనుకున్నాడు. తను యేమన్నా యేది చేసినా యేదో స్వలాభం తోను, అసూయతోనే చేయటం జరుగుతుంది కానీ ఆమె రక్షకునిగా చెయ్యటం లేదని తప్పించుకోవటం వలన వూరు

కున్నాడు. ఆఫీసుకు పోయినా, ఇంట్లో ఈ సరికి యేం జరుగుతుందో వూహించుకునే వాడు. తను కమల నివసించే గదిలో వీళ్లిద్దరూ స్వేచ్ఛగా విహరిస్తుంటారని తోచగానే భరించలేక ఇంటికి వచ్చేసరికి ఆమె యేదో పనిపాట్లు చేసుకుంటోంది. ఎన్ని మాటలు అందామని వచ్చాడో అన్నీ దిగమింగేసాడు. ఇంకో రోజున ఆమె పెరటి వరండాలోనే వాడితో పాటు మాటాడుతోంది. అక్కడికి వెళ్లడం మర్యాద కాదనుకున్నా చప్పున వెళ్లాడు. ఆమె నిర్ఘాంత పోయింది. ఏమీ మాటాడకండా కోపంగా మొఖం పెట్టి వచ్చేసాడు.

ఆ క్షణం నించి ఆమె అతని యెదుట పడటానికి జంకుతోంది. పువ్వు మీద మంచులా ఆమెకు దిగులు కప్పేసింది అతను ఇంట్లో ఉండగా ఇదివరకు ఉన్న చనువులేదు, సంతోషం లేదు. చాటు మాటుగా కదులుతోంది. కనకరాజు ఈ మార్పును సహించలేక పోయాడు. ఇదివరకు ఆమె నిర్లక్ష్యంగా వదిలి పెట్టిన యవ్వనం, ఎప్పుడూ చిరునవ్వుతో చిందులు తొక్కే పెదాలు, అరమరికలు లేకండా అన్నీ అమర్చి పెట్టే ఆ చనువు --ఇవన్నీ ఇప్పుడు కరవు కాగానే అతను ఇంట్లో ఉండలేక పోయాడు.

ఎన్నాళ్లై తీరని కోరిక ఎలాగైనా సాధించుకోవాలన్న పట్టుదల హెచ్చయింది. తనలో ఎన్నెన్నో ఆలోచనలు కలిగినయ్. ఆమెను ఒకసారి యేదో చేసేస్తే ? తన కోరిక ఆమెతో చెప్పితే ? ఆమె అందుకు ఒప్పుకుంటే ? ఆమె తనను పెళ్లి చేసుకోడానికి ఒప్పుకుంటే తనకు సంఘంలో ఉన్న మర్యాద అంతా గంగలో కలిసిపోతుంది. "నీకూ నాకు జోడీ యెలా కుదురుతుంది బాబూ. నీ కూతురులాంటి దాన్ని" అంటే తనకు జబాబు చెప్పటానికి మాటలు రావు.

అతనికి రోజుకు రోజు వికారం హెచ్చవుతోంది. తనింకా యౌవనంలోనే ఉన్నాడు. తనలో ఉన్న సున్నితం, సంస్కారం, ఉగ్గులు తేరిన తన జుత్తు, పుటం వేసిన బంగారం లాంటి తన శరీరచ్ఛాయ, ఆడది చూడగానే వలపులను పండించగల తనకు మాని పేదరికం, మోటుతనంతో నిండిన మనిషితో పున్నమ్మ సంపర్కం పెట్టుకోవటం— ఈ అవమానంతో అతని హృదయం బేజారవుతోంది. ఈ విషయంలో మౌనం యెంత కాలమో తనకు వరించలేదు. ఒకసారి పరోక్షంగా ఆమెకు వినిపించేటట్లు అన్నాడు "ఈ మొగాళ్లు మోసం చేస్తారు" ఇంకోసారి "ఒక్కర్తే ఉంటావు ఇల్లు జాగ్రత్త" అన్నాడు. వేరొకసారి "ఎవరిని నేను లేనప్పుడు రానివ్వకు" అన్నాడు. ఆఫీసుకు వెళ్లిపోతూ తన అడివి పువ్వు మీద రాలటానికి యెన్నో తుమ్మెదలు కొట్లాడుకోవటం గమనించాడు.

ఆమె మనసు మెల్లగా మార్చాలన్న ప్రయత్నంతో ఒకసారి "పున్నమ్మా— నీవు లేకపోతే పిల్లల గతి చూడు" ఆమె జబాబు చెప్పకండా అలాతల దించుకునే ఉంది.

"మాట్లాడవేం ?"

"నే నెక్కడికి వెళ్ళిపోతాను బాబూ ?"

"అయితే యెందుకలా దిగులుగా ఉంటున్నావ్ ?"

"ఏంలేదు బాబూ"

"చూడు— ఇంకా చిన్నదానివు కావు. మంచీ చెడు తెలుసుకొని మెసలాలి."

పున్నమ్మ చప్పున కళ్ల నీరు తెచ్చుకుంది.

"ఏడవక. నీకు కష్టం పెట్టడం నాకిష్టం లేదు."

"అమ్మగారే ఉంటే—" అంటూ ఇంక వెక్కుతూనే వంటింట్లోకి వెళ్లిపోయింది.

ఈ మాట ఎన్నో అర్థాలు నిస్తోంది. అమ్మగారే ఉంటే ఇలాంటి చూపులతో మీరు నన్ను వేధించేవారా ? అమ్మగారే ఉంటే వయసు వచ్చిందని నన్ను ఎవణ్నో చూసి పెళ్లి చేసే వారుకదా ? అమ్మగారే ఉంటే నేనిలా పాడయ్యేదాన్నా ? అమ్మగారే ఉంటే.... ఇలా యెన్నో ప్రశ్నలూ సమాధానాలతో తోటలో గడ్డిలో కూల బడిపోయాడు. కామంతో చీకటైన హృదయంలో అప్పుడప్పుడూ ఆత్మ వెలుగు పడుతోంది. ఆ వెలుగు కదలగానే మళ్లీ చీకటి. ఆమెకు దగ్గర దగ్గర అవుతున్నాడు. మాటలు కలుపుతున్నాడు. ఆమెను చూసి నవ్వబోతున్నాడు. తాకబోతున్నాడు. ఎల్లప్పుడూ ఆమె గురించే ఆలోచిస్తున్నాడు. అడవి పూవు వాడిపోలేదు. అతని తృష్ణ చల్లారలేదు.

ఒకనాడు రాత్రి చిన్నపిల్ల నిద్దరనించి లేచి యేడుస్తోంది. ఎందుకో చెప్పదు. బహుశః తల్లి జ్ఞప్తికి వచ్చిందేమో ? లేక తల్లి కలలో కనిపించిందేమో ? అంతవరకు పున్నమ్మ గురించి ఆలోచిస్తూ నిద్దరపోని కనకరాజు ప్రక్కగది వేపు వెళ్లి తలుపు తట్టాడు. పున్నమ్మ చిన్న పిల్లను భుజం మీద వేసుకొని వోదారుస్తూ తలుపు గడియ తీసింది. పిల్లను తీసుకొని ఇటు అటు కదులుతూ ఒక మూల తలదించి నిల్చున్న పున్నమ్మవేపే చూస్తున్నాడు. ఆమె తరగని శృంగారంతో ఒయ్యారంగా ఉంది. యౌవనం సెంటులాగు ఘువ

ఘుమఘుమ వుంటూ గుభాళిస్తోంది. ఒళ్లంతా కళ్లు చేసుకొని చూస్తుంటే అప్పుడప్పుడూ పైకెగసిన ఆమె కళ్లు బెదర సాగినయ్. పిల్లను ఆమె చేతికి అందివ్వబోయాడు. ఆమె అతనికి తగలకుండా అందుకుంది.

"పిల్లకు భయమేమో దీపం ఉంచి పడుకో" అన్నాడు.

మౌనంగా తల వూపింది. కాళ్లు కట్టేసినా అక్కడ నించి మర్యాదకు కదిలిపోయాడు. తిరిగి వచ్చినా కనకరజాకు నిద్దరలేదు. వలపు ఒళ్లంతా కుమ్మరిస్తోంది. వయసు వెనుకకు ప్రయాణం చేస్తోంది. ఒకసారి లేచి ప్రక్కగది వేపు వెళ్లాడు. అద్దం తలుపుగుండా తొంగి చూసాడు. పైన తిరుగుతున్న ఫేను గాలిలో పున్నమ్మ ఒళ్లు మరచి నిద్రపోతోంది. చీటిలో నిద్దరపోతున్న బలసిన బొంతచేపలా ఉంది. తను ఈదినా దానిని పట్టుకోలేడు. అతను గట్టుదాటని సముద్రంలా కట్టుబాటుతో ఉంటే వలపన్నలేడు. చూపులను ఆమె అవయువాలపై అప్పజెప్పి అతను గుటకలు మింగసాగాడు. రానురాను ఉప్పొంగి పోతున్న సముద్రంలా హృదయంనించి రక్తం పొంగ సాగింది. ఆ హోరు తను వినలేక పోతున్నాడు. రావి ఆకులా వడవడ వణికిపోతూ తలుపు తట్టాడు. ఆమె చేప. నిద్దర భంగమైంది. చీర సర్దుకొని ప్రక్కకు తిరిగి పడుకుంది. పెద్ద నిట్టూర్చి మళ్లీ తలుపు తట్టాడు.

పున్నమ్మ ఒక్కసారి తలెత్తి చూసింది. ప్రసరిస్తున్న కామదృష్టికి అలాంటి చిరునవ్వే జతచేర్చాడు. ఆమె గాభరా పడింది. ఆమె పెదాలు కదిలాయి గానీ ఆ మాటలు అతనికి వినిపించలేదు. లేచి చప్పున దీపం ఆర్పేసింది. ఆమె యేమైందో అతనికి కనపడలేదు. చీకటిలో ఆమెవైపు చూడలేని కళ్లు అవమానంతో తనలోనికి చూసినయ్. ఆమె తనను అవమానించి నందుకు నానా దుర్భాషలు మనసులోనే ఆడుకున్నాడు. ఆ మరుచటి రోజు ఆమె పని పట్టేస్తానసుకున్నాడు. చెప్పేసట్టు వినకపోతే యెలా వచ్చిందో అలానే పంపించాలని నిశ్చయించుకున్నాడు. ఆమెపై పగతీర్చుకొనే ఆలోచనలు అంతం కాకుండానే యెలాగో ఆలస్యంగా మగత నిద్ర కప్పేసింది.

తెలివి వచ్చేసరికి కిటికీగుండా సూర్యరశ్మి పడుతోంది. ప్రక్కకు చూసాడు. టేబిలు మీద బెడ్ కాఫీ లేదు. చప్పున లేచి వంట ఇంటివేపు వెళ్లాడు. అంగటికి రాగానే గేటు తలుపులు తెరిచి ఉన్నాయ్. గబగబా గేటు దగ్గరకి నడిచాడు. అడవి పూవే కాదు మొక్కతో యేదో పసువు పీక్కొనిపోయింది. మాయని గేటుకు ఆనుకొని రెండోసారి పగిలిన హృదయాన్ని పట్టుకొని నిల్చుండి పోయాడు.